05ATP27_05ATP27.qxd 04-01-2024 PM 10:41 Page 1



# 7న యుటీఎఫ్ ఆధ్వర్యంలో ఉచిత గుండె వైద్య శిబిరం

### -కరపత్రాలు విడుదల చేసిన యుపీఎస్ సీఐ యం.తిమ్మయ్య

ఉరవకొండ, జనవరి 4 ప్రభాతవార్త



కరపత్రాలను విడుదల చేస్తున్న యుపీఎస్ సీఐ యం.తిమ్మయ్య, యుటీఎఫ్ నాయకులు

ఉచిత గుండె వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఉరవకొండ అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ సీఐ యం. తిమ్మయ్య సూచించారు. ఈనెల 7వ తేదీన అనంతపురంలోని మార్క్ సూపర్ స్పెషాలిటీ గుండె ఆసుపత్రి సౌజన్యంతో ధర్మవరం ఆత్మీయ ట్రస్ట్ వారిచే యుటీఎఫ్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎస్.కె ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగనున్న ఉచిత గుండె వైద్య శిబిరం కరపత్రాలను గురువారం సాయంత్రం ఆయన స్థానిక పోలీస్ స్టేషన్‌వద్ద యుటీఎఫ్ నాయకులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా యుటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ ఉదయం 10 గంటల నుండి మధ్యాన్నం 2 గంటల వరకు జరిగే ఉచిత గుండె వైద్య శిబిరంలో బ్లడ్ షుగర్, బి.పి, ఇ.సి.జి, 2డి ఎకో పరీక్షలు జరుగుతాయన్నారు. గుండె నొప్పి/ఛాతి నొప్పి, గుండె దడ, ఆయాసం, కళ్ళు తిరగడం, గుండెలో మంట కలగడం, ఛాతిలో బరువుగా ఉండటం, నిద్రలో ఆయాసం వచ్చి లేని కేర్చొవడం, కాళ్ళు వాపురావడం, చమటలు పట్టడం లాంటి సమస్యలతో బాధపడుతున్న వారు గుండె వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో యుటీఎఫ్ జిల్లా సహాధ్యక్షులు ఆర్.రామప్పచౌదరి, నాయకులు సంజీవకుమార్, శేఖర్, జయరాములు, శ్రీనివాసులు, ఉమాపతి, రఘు, ఇస్లాంబాషా, నాగరాజు, బండయ్య తదితరులు పాల్గొన్నారు.

# రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశ డే

### -వివిధ అంశాలపై అవగాహన కల్పించిన వైద్యాధికారిణి డాక్టర్ పావని

ఉరవకొండ, జనవరి 4 ప్రభాతవార్త



ఆశ కార్యకర్తలకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారిణి డాక్టర్ పావని

మండల పరిధిలోని రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ఆశ డే కార్యక్రమం జరిగింది. పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ పావని సీహెచ్‌ఓ నాగరంగయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ షఫీతో కలిసి ఆశలకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు.



ఆశ కార్యకర్తలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న దృశ్యం

వ్యాధి నిరోధక టీకాల ప్రాధాన్యత, పిల్లలకు ఏయే వయసులో ఏ టీకాలు వేస్తారు, టీకాల కార్యక్రమంలో ఆశల పాత్రను తెలియజేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆశల విధులు, ఆశ ఈ-యాప్, గర్భిణీ నిర్ధాయక కిట్లు, గుర్భస్థ లింగ నిర్ధారణ నిరోధక చట్టంపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా కాన్సర్‌కుకారకమైన పొగాకును వినియోగించమని దాని దుష్పరిణాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామని వారితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు శేఖర్, స్వర్ణలత, ఆరోగ్య కార్యకర్తలు వెంకటేష్, రాఘవేంద్ర, ముకుందర్, ఏఎన్‌ఎంలు లలిత, హేమలత, కోమల, సలీమ, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

# 24వ రోజు కొనసాగిన అంగన్‌వాడీల నిరవధిక సమ్మె

### -సీయం జగన్ స్పందించాలన్న అంగన్‌వాడీలు

ఉరవకొండ, జనవరి 4 ప్రభాతవార్త



24వ రోజు కొనసాగిన సమ్మెలో పాల్గొన్న అంగన్‌వాడీలు

వేతనాల పెంపు, గ్రాట్యుటీ అమలు తదితర డిమాండ్లతో అంగన్‌వాడీలు చేపట్టిన రాష్ట్ర వ్యాప్త నిరవధిక సమ్మె గురువారం ఉరవకొండలో 24వ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా సమ్మె శిబిరంలో అంగన్‌వాడీలు నినాదాలతో హోరెత్తించారు. వారు మాట్లాడుతూ పదోన్నతులు కల్పించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ 5 లక్షలకు పెంచాలని, ఆఖరి వేతనంలో 50శాతం పెన్షన్ ఇవ్వాలని, హెల్పర్ల పదోన్నతుల్లో నిబంధనలు రూపొందించాలని, రాజకీయ జోక్యాన్ని అరికట్టాలని, పదోన్నతుల వయసు 50 సంవత్సరాలకు పెంచాలని, సర్వీసులో ఉండి చనిపోయిన అంగన్‌వాడీ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తూ బీమా అమలు చేయాలని, ప్రభుత్వ ఉద్యోగుల మాదిరి రిటైర్మెంట్ వయసును 62 సంవత్సరాలకు పెంచాలన్నవి న్యాయమైన డిమాండ్లని వాటిని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి సహృదయంతో పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఎస్.మధుసూదన్, జిల్లా కమిటీ సభ్యుడు ఎ.రంగారెడ్డి, అంగన్‌వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు కె.ధనలక్ష్మి, పి.జయలక్ష్మి, కె.శ్వేతనాగు, వరలక్ష్మి, రంగమ్మ, మస్తానమ్మ, లలిత, హైమావతి, శివజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# 2047కు అభివృద్ధి చెందిన దేశంగా భారత్..!

### -అవగాహన సదస్సులో ఇంచార్జ్ ప్రిన్సిపాల్ వై.సురేష్‌బాబు

ఉరవకొండ, జనవరి 4 ప్రభాతవార్త



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు. చిత్రంలో ఇంచార్జ్ ప్రిన్సిపాల్ వై.సురేష్‌బాబు సిబ్బంది ఉన్నారు

2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్‌ను నిలపడంలో విద్యార్థులు, యువత కీలక భూమిక పోషించాల్సిన అవసరముందని ఇంచార్జ్ ప్రిన్సిపాల్ వై.సురేష్‌బాబు అన్నారు. మండల పరిధిలోని చిన్నముష్టూరు గ్రామంలోగల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం వికసిత్ భారత్ 2047 కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కమీషనర్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ సి.నాగరాణి ఆదేశాల మేరకు నిర్వహించిన అవగాహన సదస్సులో వై.సురేష్‌బాబు మాట్లాడుతూ దేశంలోని ప్రతి పౌరుడు ఎదగడానికి సృజనాత్మకత, సాంకేతికతతో కూడిన కొత్త ఆవిష్కరణలకు సాంకేతిక విద్యార్థుల సహకారం అవసరమన్నారు. స్థిరమైన అభివృద్ధికి తోడ్పడే అంశాలను పొందు పర్చాలన్నారు. సివిల్ ఇంజనీరింగ్ శాఖాధిపతి డా॥ఎస్.సులోచన ఆధ్వర్యంలో ప్రపంచంలోనే భారతదేశం అగ్రస్థానంలో ఉండాలన్న ఆశయంతో ముందుకు అడుగులు వేయడంపై ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్థిక పురోగతి, సుపరిపాలన, భద్రత అంశాలపై పలువురు విద్యార్థులు అంతర్జాలం ద్వారా వికసిత్ భారత్ పోర్టల్‌లో పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకుల బృందం పి.చంద్రమ్‌బాబు, జెడ్.మోసెస్ రవీంద్రనాథ్, పి.అనీల్, జి.రాజేష్‌కుమార్, పి.రామానాయుడు, వి.సాయి సందీప్, ఎస్.అలీహాప్ హుసేన్, యం.ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఇస్తామాలో పాల్గొన్న వైసిపి, టిడిపి నాయకులు

హిందూపురం టౌన్, జనవరి 4 ప్రభాతవార్త



ఇస్తమాలో పాల్గొన్న ఎంఎల్‌సి

పట్టణంలోని పరిగి రోడ్డులో రెండవ రోజు జరిగిన ఇస్తామా కార్యక్రమంలో వైసిపి ఎంఎల్‌సి షేక్ మహమ్మద్ ఇక్బాల్, తెలుగుదేశం పార్టీ నాయకులు డిఇ రమేష్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్‌సి ఇక్బాల్‌ను హిందూపురం మున్సిపల్‌చైర్‌పర్సన్ ఇంద్రజ ఇస్తామాలో మర్యాద పూర్వకంగా కలిశారు. అదేవిధంగా ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి, తెలుగుదేశం పార్టీ నాయకులు ఇస్తామాలో కూల్‌డ్రింక్స్, పండ్లు పంపిణీ చేశారు.

# షర్మిల కాంగ్రెస్‌లో చేరడం శుభపరిణామం

హిందూపురం టౌన్, జనవరి 4 ప్రభాతవార్త



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

వైఎస్ షర్మిల కాంగ్రెస్ పార్టీలో చేరడం శుభపరిణామమని పిసిసి జనరల్ సెక్రటరీ బాలాజీ మనోహర్ అన్నారు. షర్మిల పార్టీలో చేరడంపై హర్షం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం ఇందిరా గాంధీ విగ్రహం వద్ద నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని మేధావులు, ప్రజాస్వామ్యవాదులు అందరూ పార్టీలోకి రావాలని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో అమానుల్లా, పట్టణ అధ్యక్షులు జమీల్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆశ్రమాలకు 2 క్వింటాళ్ళ బియ్యం వితరణ చేసిన ఏవీఆర్ పాఠశాల

### -హెల్పింగ్ నేచర్ కార్యక్రమం ద్వారా సమకూర్చిన విద్యార్థులు

ఉరవకొండ, జనవరి 4 ప్రభాతవార్త



బియ్యం సేకరించిన పాఠశాల విద్యార్థులతో ప్రిన్సిపాల్ విక్రమ్‌బాబు సిబ్బంది

పట్టణంలోని విఠల్ రుక్మిణీ విజయ వృద్ధ అనాధాశ్రమం, మొట్ట మొదటి అనాధ పిల్లల ఆశ్రమానికి ఏవీఆర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు గురువారం 2 క్వింటాళ్ళ బియ్యం వితరణ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ విక్రమ్‌బాబు మాట్లాడుతూ హెల్పింగ్ నేచర్ కార్యక్రమం ద్వారా పాఠశాలల చదువుతున్న విద్యార్థులు బియ్యాన్ని పోగు చేశారన్నారు.



విఠల్ రుక్మిణి వృద్ధాశ్రమానికి బియ్యం అందజేస్తున్న దృశ్యం

మానవ సేవయే మాధవ సేవని విద్యార్థులు విద్యార్థి దశ నుండే సేవా గుణాన్ని అలవర్చుకోవాలని, పేదలు, దివ్యాంగులపై దయ కలిగి ఉండాలన్న ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. పాఠశాల ఆధ్వర్యంలో ప్రతినెలా ఒక సామాజిక కార్యక్రమాన్ని కొనసాగిస్తామని ప్రిన్సిపాల్ విక్రమ్‌బాబు వివరించారు.

# 10 నుంచి 'ఆడుదాం ఆంధ్ర' మండలస్థాయి క్రీడాపోటీలు

### -సచివాలయస్థాయిలో ఉత్తమ ప్రతిభ చూపిన క్రీడాకారులతో టీంలు -ఉరవకొండ మండల పరిషత్ అభివృద్ధి అధికారి యం.డి.అమృత్‌రాజ్

ఉరవకొండ, జనవరి 4 ప్రభాతవార్త



ఫిజికల్ డైరెక్టర్లతో సమావేశంలో పలు సూచనలు చేస్తున్న ఎంపీడీఓ యం.డి.అమృత్‌రాజ్

ఈనెల 10 తేదీ నుండి ఆడుదాం ఆంధ్ర మండల స్థాయి క్రీడాపోటీలు 3 రోజుల పాటు జరుగుతాయని మండల ప్రజా పరిషత్ అభివృద్ధి యం.డి.అమృత్ రాజ్ తెలిపారు. పట్టణంలోని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆయన పీడీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ యం.డి.అమృత్‌రాజ్ మాట్లాడుతూ మండలస్థాయి క్రీడా పోటీలు పట్టణంలోని ఎస్.కె.ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరుగుతాయన్నారు. మండలంలోని 19 సచివాలయాల నుండి వివిధ క్రీడల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులతో ప్రతి క్రీడాంశం క్రికెట్, ఖోఖో, కబడ్జీ, వాలీబాల్, బాడ్మింటన్ టీంలను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ప్రతి క్రీడాంశం నుండి మెన్, ఉమెన్ టీంలను ఎంపిక చేసి లాటరీ పద్ధతిలో ఫిక్సర్స్‌వేసి పోటీలు నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ఆడుదాం ఆంధ్ర నియోజకవర్గ బాధ్యుడైన ఫిజికల్ డైరెక్టర్ సి.మారుతిప్రసాద్, ఉపాధ్యాయులు హరి, పీడీలు చంద్రశేఖర్, ప్రవీణ్, లత, కళ్యాణి, లక్ష్మి,అశ్రాఫ్,రాజేష్,కిరణ్, రాఘవేంద్ర, రమణ పాల్గొన్నారు.

# టమోటా వాహనం బోల్తా

లేపాక్షి, జనవరి 4 ప్రభాతవార్త



బోల్తాపడిన బొలెరో వాహనం

మండలంలోని చోళసముద్రం గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై టమోటా లోడుతో వెళుతున్న బొలెరో వాహనం ప్రమాదవశాత్తు బోల్తాపడింది. మడకశిర ప్రాంతం నుండి కర్ణాటక లోని కోలర్ మార్కెట్‌కు టమోటా లోడుతో వెళుతుండగా గురువారం తెల్లవారుజాము సమయంలో అదుపుతప్పి బోల్తాపడింది. అయితే వాహనంలో వున్న వారికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. టమోటాలు ఆ ప్రాంతమంతా చెల్లాచెదురుగా పడడంతో రైతుకు నష్టం వాటిల్లింది. వాహనం కొంత మేర దెబ్బతినింది.

# కర్ణాటక మంత్రిని కలసిన కాంగ్రెస్ మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ

గోరంట్ల,జనవరి 4,ప్రభాతవార్త:



మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న దృశ్యం

కర్ణాటక రోడ్లు భవనాల శాఖ మంత్రి వాల్మీకి సతీష్‌జర్కోలిని బెంగళూరులో ఆయన చాంబర్‌లో గురువారం కాంగ్రెసన పార్టీ గోరంట్ల మండల కన్వీనర్ మర్యాద పూర్వకంగా కలసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న రాజీకీయలను తెలుసుకొని రాష్ట్రంలో కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది చంద్రాచర్ల హరి పాల్గొన్నారు.

# అక్రమ మద్యం, నాటుసారాపై సెబ్ అధికారుల ముమ్మరదాడులు

పుట్టపర్తి,జనవరి 04, ప్రభాతవార్త



పట్టుబడ్డ అక్రమ మద్యం పాకెట్లు చూపుతున్న సెబ్ అధికారులు

శ్రీసత్యసాయి జిల్లా వ్యాప్తంగా అక్రమ మద్యం, నాటుసారా తయారీదారులపై సెబ్ అధికారులు ముమ్మర దాడులు నిర్వహించారు. గురువారం ఒక రోజే 13 కేసులు నమోదు చేసిన సెబ్ అధికారులు కర్ణాటక మద్యం, నాటుసారా అక్రమ తయారీ దారులపై ఉక్కుపాదం మోపారు. ధర్మవరం సెబ్ స్టేషన్ పరిధిలో రెండు కేసులు నమోదు చేసి 375 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు తెలియజేశారు. కదిరి సెబ్ పరిధిలో ఒక వ్యక్తి వద్ద నుడి 6 లీటర్లుసీజ్ చేసి ముద్దాయిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. హిందూపురం సెబ్ పరిధిలోని 2 ఎన్‌డిపిఎల్ కేసులునమోదు చేసి 100 కర్ణాటక మద్యం పాకెట్లు,1 ద్విచక్రవాహనం సీజ్ చేయడం జరిగిందన్నారు. తూముకుంట చెక్‌పోస్టు వద్ద రెండు కేసులు నమోదుచేసి 107 కర్ణాటక మద్యం పాకెట్లు 1 ద్విచక్రవాహనం సీజ్‌చేశారు. పుట్టపర్తిలో 2ఎన్‌డిపిఎల్ కేసులు నమోదు చేసి 43 కర్ణాటక మద్యం పాకెట్లు, పుట్టపర్తి సెబ్ పరిదిలో 1 ఎన్‌డిపిఎల్ కేసు నమోదు చేసి 25 కర్ణాటక మద్యం పాకెట్లు,చెనే్నకొత్తిపల్లి సెబ్ పరిధిలో 1ఎన్‌డిపిఎల్ కేసు నమోదుచేసి 35 కర్ణాటక మద్యం పాకెట్లు, పెనుకొండ సెబ్ స్టేషన్ పరిధిఓ 1 ఎన్‌డిపిఎల్ కేసు నమోదు చేసి 40 కర్ణాటక మద్యం పాకెట్లు, తనకల్లు సెబ్ స్టేసన్ పరిధిలో 1 ఎన్‌డిపిఎల్ కేసు నమోదు చేసి 40 కర్ణాటక అక్రమమద్యం పాకెట్లు స్వాధీనం చేసుకొని వరుసగాకేసులు నమోదు చేసినట్లు తెలియజేశారు.

# నేడు ఎపిఎస్‌సిపిసిఆర్ మెంబర్ రాజేంద్రప్రసాద్ పర్యటన

పుట్టపర్తి, జనవరి 04, ప్రభాతవార్త

శ్రీసత్యసాయి జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలో శుక్రవారం ఎపిఎస్‌సిపిసిఆర్ మెంబర్ జె.రాజేంద్ర ప్రసాద్ పర్యటించనున్నట్లు జిల్లా సమాచార, పౌరసంబంధాల శాఖ అధికారులు తెలియజేశారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆయన రెండురోజుల పాటు శ్రీసత్యసాయి జిల్లాలో పర్యటించనున్నట్లు తెలియజేశారు. శుక్రవారం ఉదయం 10 గంటకు ఆయన రోడ్డు మార్గం గుండా పుట్టపర్తి చేరుకుంటారని, తొలుత పుట్టపర్తిలోని కలెక్టరేట్ నందు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎస్పి ఎస్.వి.మాధవ రెడ్డిలతో చర్చిస్తారని, అనంతరం 11:30 గంటలకు జిల్లా స్థాయి సమీక్షా సమావేశం నందు సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల అధికారులు, ఎస్‌సి, ఎస్‌టి, బిసి సంక్షేమ శాఖల అధికారులు, ఆంధ్రప్రదేశ్ డా.బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల, కెజిబివి, మోడల్ స్కూల్ మరియు ఎంఇఒలు, అన్ని ప్రైవేటు పాఠశాలలయాజమాన్యాలతో సమావేశం నిర్వహించనున్నట్లు తెలియజేశారు. మధ్యాహ్నం 1:30 నుండి 02:30 గంటల వరకు భోజన విరామం అనంతరం మధ్యాహ్నం 03:00 గంటలకు కొత్తచెరువులో ఓరియంటేషన్ ప్రోగ్రామ్, సాయంత్రం 05:15 గంటలకు పుట్టపర్తిలోని హ్యాపీ హోం చిన్నపిల్లల కేర్ సెంటర్‌ను సందర్శించనున్నట్లు తెలియజేశారు. అలాగే శనివారం ఉదయం 10:30 గంటలకు మడకశిరలో గ్రామ, మండల స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం మధ్యాహ్నం భోజన విరామం తరువాత మధ్యాహ్నం 02:30 గంటలకు అక్కడి కెజిబిపి పాఠశాల , సాయంత్రం 04:30 గంటలకు హిందూపురంలోని బాలసదన్, ఛిల్డ్రన్ హోంలను సందర్శించనున్నట్లు తెలియజేశారు.

# వినూత్నరీతిలో మున్సిపల్ కార్మికుల నిరసన

పుట్టపర్తిటౌన్, జనవరి 04, ప్రభాతవార్త



చెట్టు కొమ్మలు కట్టుకొని నిరసన తెలుపుతున్న సిఐటియు,కార్మిక సంఘం నాయకులు

మున్సిపల్ కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నిరవధిక సమ్మెలో భాగంగా చెట్టు కొమ్మలు ఆకులు కట్టుకొని వినూత్నంగా నిరసన తెలియజేశారు. గురువారం కార్మికులు చేపట్టిన సమ్మె 10వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సిఐటియు పట్టణ కార్యదర్శి గంగాధర్‌తో పాటు కార్మిక యూనియన్‌నాయకులు మాట్లాడుతూ, 10రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు ఇవ్వాలని, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, అవసరమైన పనిముట్లు అందజేయాలని తాము డిమాండ్ చేస్తున్నట్లు తెలియజేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు ఇవ్వకపోతే తాము ఏమి తిని బ్రతకాలని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి గతంలో ఇచ్చిన హామీలనే నెరవేర్చాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక యూనియన్‌నాయకులు నాగార్జున, నరసింహులు, గోవిందు, రామయ్య, పెద్దన్న, సాయి, బాబయ్య, రామక్క, అనిత, తదితరులుపాల్గొన్నారు.



మున్సిపల్ కమీషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

**నేటి నుండి త్రాగునీరు, వీధి దీపాలు బంద్ :** మున్సిపాలిటీ పరిధిలో పని చేస్తున్న ఇంజనీరింగ్ విభాగం కార్మికులు శుక్రవారం నుండి త్రాగునీరు, వీధిదీపాల సరఫరాను బంద్ చేస్తున్నట్లు ప్రకటించారు. గత 10 రోజులుగా పారిశుద్ధ్య కార్మికులతోపాటు తాము కూడా సమ్మెలో పాల్గొన్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, అందుకే తాము శుక్రవారం నుండి విధులు బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు గురువారం మున్సిపల్ కమీషనర్‌రాం భూపాల్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికుల పట్టణ కార్యదర్శి పైపల్లిగంగాధర్, గణేష్, రామదాసు, పోతులయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ధ్యేయం -డిఆర్ఓ కొండయ్య

పుట్టపర్తి, జనవరి 04, ప్రభాతవార్త



సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్ఓ కొండయ్య

18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే మా ధ్యేయమని డిఆర్ఓ కొండయ్య పేర్కొన్నారు. గురువారం ఉదయం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్ నందు గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎన్నికల విభాగం డిప్యూటీ తహశీల్దార్ మైనుద్దీన్, బిజెపి నుండి నారాయణ, కాంగ్రెస్, తెదేపా, సిపిఎం.సిపిఐ, ఆమ్ ఆద్మీ తదితర పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల సంఘం తెలిపిన పలు విషయాలను డిఆర్ఓ వివరిస్తూ ఫారం 6,7,8,9 ఓటర్ల నమోదులో మార్పులు చేర్పులు, తొలగింపునకు సంబంధించిన ఇతరాత్ర వివరాలను సమావేశంలో వెల్లడించారు. జిల్లాలో డిసెంబర్ 12, 2022 నుండి డిసెంబర్ 10, 2023 వరకు వివిధ నియోజకవర్గాల్లోని క్లైమ్స్‌ను వివరించారు. ఫారం06కు సంబంధించి 92,035 క్లైమ్స్ స్వీకరించగా, ఇందులో 81,804 క్లైములు పరిష్కరించడం జరిగిందని, 10,227 వరకుతిరస్కరించబడ్డాయని, 4 ఆమోదం తెలిపామన్నారు. ఫారం-7కు సంబంధించి 62,227 క్లైమ్స్ స్వీకరించగా, ఇందులో 48,546 పరిష్కారం కాగా, 13660 తిరస్కరించబడ్డాయని, 4 ఆమోదం తెలుపగా, 15 పెండింగ్‌లో ఉన్నాయని, ఈఆర్ఓ వద్ద 2ఉన్నట్లు తెలిపారు. ఫారం-8కు సంబంధించి 60660 క్లైమ్స్ స్వీకరిచగా, ఇందులో 57,333 దాకా పరిష్కరించబడ్డాయని, 3311 తిరస్కరణ కాగా, 16 ఆమోదం కాబడినట్లు డిఆర్ఓ తెలియజేశారు.

# చంద్రబాబును కలసిన జిల్లా బిసి నాయకులు

పుట్టపర్తి రూరల్, జనవరి 04, ప్రభాతవార్త



భగవాన్‌సత్యసాయి బాబా చిత్రపటాన్ని చంద్రబాబుకు బహూకరిస్తున్న బిసి సంఘంనాయకులు

టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడును శ్రీసత్యసాయి జిల్లా బిసి నాయకులు గురువారం కలుసుకున్నారు. విజయవాడలోని మంంగళగిరి టిడిపి కార్యాలయంనందు చంద్రబాబుకలసి సత్యసాయి ఫోటోలు బహూకరించారు. టిడిపి హయాంలోనే బిసిలకు న్యాయం జరిగిందని, ప్రస్తుతం జరుగనున్న ఎన్నికల్లో కూడా బిసిలకు తగిన ప్రాధాన్యత కల్పించాలని కోరనిట్లు జిల్లా అధ్యక్షులు కొట్టాల శ్రీరాములు, కురుబ సంఘం జిల్లా అధ్యక్షులు సామకోటి ఆదినారాయణ చంద్రబాబును కోరినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంగళగిరి నుండి నాయకులు మాట్లాడుతూ, బిసిల అభివృద్ధి టిడిపితోనే సాధ్యమని, ఎస్‌సి, ఎస్‌టి తరహాలో బిసిల రక్షణకు ప్రత్యేకచట్టం చేస్తామని టిడిపి ప్రకటించిందన్నారు. ఈ చట్టం రూపొందితే బిసిలపై దాడులు, దౌర్జన్యాలు ఆగుతాయన్నారు. తాము చంద్రబాబుకు బిసిల మద్దతు ఈ సారి టిడిపికే పూర్తిగా ఉంటుందని చెప్పామన్నారు. చంద్రబాబు కూడా వచ్చేఎన్నికల్లో కష్టపడి పార్టీ విజయానికి కృషి చేయాలని మీ సమస్యలు ఏమైనా ఉంటే పరిష్కారానికి కృషిచేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో బిసినాయకులు కె.ఎస్.పార్థసారథి, గాండ్ల సంఘం నియోజకవర్గ అధ్యక్షులు శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# యువకుడి హత్య కేసు నిందితులపై గూండా చట్టం కింద చర్య తీసుకోవాలంటూ ధర్నా

బళ్లారి, జనవరి04, ప్రభాతవార్త;



జిల్లాధికారి కార్యాలయంలో ఆందోళన చేస్తున్న పింజార్ సమాజం ప్రజలు

నగరంలో 2023 డిసెంబర్ 31వ తేదీన జరిగిన యువకుడి హత్య కేసు నిందితుల్ని గూండా చట్టం కింద అరెస్టు చేసి చర్యలు తీసుకోవాలని కర్ణాటక రాష్ట్ర నదాఫ్ పింజార్ సంఘం నేతృత్వంలో వందలాది మంది సమాజం ప్రజలు నగరంలో ప్రతిఘటన జరిపారు. సంఘం జిల్లాధ్యక్షుడు పి.శాషాద్, ఉపాధ్యక్షుడు షేక్‌సాబ్, సంఘటన కార్యదర్శి పి.షాషావలి, సహ కార్యదర్శి పి.బీజన్ సాబ్, కోశాధికారి పి.మౌలాలిల నేతృత్వంలో సమాజం ప్రజలు ర్యాలీ ప్రదర్శన చేపట్టి జిల్లాధికారి కార్యాలయానికి చేరుకొని ఆందోళన చేపట్టారు. ఈ మేరకు వారు డి.సి.కార్యాలయం అధికారికి వినతి పత్రం అందజేశారు. బ్రూస్పేట పోలీస్‌స్టేషన్‌లో డిసెంబర్ 31వ తేదీన క్రైం నంబర్ 0281/2023 ఐపీసీ 302 కింద కేసు నమోదయ్యింది. ఆరోజు ఘటనలో పింజార్ సమాజానికి చెందిన సైదుల్లా అనే యువకుడు హత్యకు గురయ్యాడు. తీవ్రంగా గాయపడిన మరొక యువకుడు రజాక్‌వలీ ఆస్పత్రిలో చావుబతుకుల మధ్య పోరాడుతున్నాడు. ఈ ఘటనకు సంబంధించి ముగ్గురు నిందితుల్ని అరెస్ట్ చేశారు. ఇంకా పలువురు నిందితుల్ని అరెస్టు చేయాల్సి ఉంది. ఈ ఘటనకు సంబంధించి నిందితులు క్రిమినల్ నేపథ్యం గలవారని, సుఫారీ హంతకులుగా పోలీసులు గుర్తించారని, ఇటువంటి వారి నుంచి సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుంది. కావునా వీరిని గూండా చట్టం కింద కేసు నమోదు చేసి జిల్లా బహిష్కరణ చేయాలని, నగరంలో ఇటువంటి ఘటనలు జరగకుండా చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 31న జరిగిన ఘటనలో హత్యకు గురైన యువకుడు సైదుల్లా అత్యంత వెనకబడిన పింజారి సమాజానికి చెందినవాడని, సౌమ్యులుగా మెలిగే పింజార్ సమాజం ప్రజలపై ఉన్నతవర్గాలకు చెందిన వ్యక్తులు కొందరు దాడులకు పాల్పడుతున్నారని, గతంలోనూ తమ సమాజానికి చెందిన వారిపై ఉన్నతవర్గాలకు చెందిన వారు దాడికి పాల్పడినట్లు ఘటనలు జరిగాయని తెలిపారు. ముమ్మందు తమపై ఇటువంటి దాడులు, ఘటనలు జరగకుండా తగు రక్షణ కల్పించాలని నగరంలో శాంతివాతావరణం కల్పించేందుకు తగు చర్యలు తీసుకోవాలని జిల్లా యంత్రాంగాన్ని వారు డిమాండ్ చేశారు. ప్రతిఘటనలో సమాజానికి చెందిన మహిళలు, యువకులు, సైదుల్లా కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వపు రవాణా రూల్స్‌పై లారీ డ్రైవర్‌ల ఆందోళన

బళ్లారి, జనవరి04, ప్రభాతవార్త;

కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీర్మానించిన రోడ్డు రవాణాకు సంబంధించి సడలించిన నియమాలు తమకు ప్రాణసంకటంగా ఉన్నట్లు, వెంటనే సదరు విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నగరంలో వందలాది మంది లారీల డ్రైవర్‌లు ప్రతిఘటన చేపట్టారు. లారీలతో పాటు భారీ వాహనాల డ్రైవర్‌లకు సంకష్టానికి గురిచేసే చట్టాన్ని జారీలోకి తెచ్చిన కేంద్ర ప్రభుత్వపు చర్యను వారు ఖండించారు. స్థానిక లారీ టర్మినల్స్ నుంచి ప్రారంభమైన లారీ డ్రైవర్‌ల ఊరేగింపు ప్రదర్శన మోతీ సర్కిల్ మీదుగా కొనసాగి జిల్లాధికారి కార్యాలయానికి చేరుకొని ప్రతిఘటన జరిపారు. జాతీయ రహదారుల్లో లారీలు, భారీ వాహనాలు సంచరించే సందర్భంలో ప్రమాదాలు జరిగి ప్రాణహానీ సంభవిస్తే ఆ ఘటనకు సంబంధించిన డ్రైవర్‌లకు 10 సంవత్సరాలు జైలుశిక్ష, రూ.10 లక్షలు జరిమానా విధించే నూతన చట్టాన్ని జారీలోకి తెస్తున్న కేంద్ర ప్రభుత్వపు హోంశాఖ మంత్రి అమిత్‌షా చర్య ఖండనీయమని వారు ఆరోపించారు. ప్రతినెలా చాలీచాలని వేతనాలతో పనిచేసే డ్రైవర్‌లకు ఇటువంటి శిక్ష విధిస్తే వారు ఎలా బతుకుతారని, తక్షణమే ఈ ఆదేశాన్ని ఉపసంహరించుకోవాలని లారీల డ్రైవర్‌లు డిమాండ్ చేశారు. ఈ మేరకు వినతి పత్రాన్ని జిల్లాధికారి కార్యాలయం అధికారికి అందజేశారు. కర్ణాటక డ్రైవర్‌ల సమాఖ్య బళ్లారి జిల్లాశాఖ పదాధికారుల నేతృత్వంలో వందలాది మంది డ్రైవర్‌లు భారీ ర్యాలీ చేపట్టడంతో ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు పోలీసులు వ్యయప్రయాసలకు గురయ్యారు.



డి.సి. కార్యాలయంలో ప్రతిఘటన జరుపుతున్న లారీ డ్రైవర్లు

06ATP27_06ATP27.qxd 04-01-2024 PM 10:40 Page 1



## ఉపాధిహామీలో 6.70 కోట్లు ఖర్చు

- 12న సామాజిక తనిఖీపై ఓపెన్ ఫోరం

అగళి, జనవరి 4 ప్రభాతవార్త

కూలీలు వలస పోకుండా ఉండాలన్న ఉద్దేశ్యంతో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద విరివిగా పనులను కల్పించింది. పండ్ల మొక్కల పెంపకం, పూల సాగు, అవెన్యూ ప్లాంటేషన్ రైతుల పొలాలకు మట్టిని తోలడం, చెక్ డ్యాంల నిర్మాణం, మరమ్మత్తు లాంటి పనులకు 1/4/2022 నుంచి 31/03/2023 వరకు 6.70 కోట్లను ఖర్చు చేసినట్లు ఏపిఓ శివన్న తెలిపారు. జరిగిన పనులపై సామాజిక తనిఖీ సచివాలయాల వారీగా నిర్వహిస్తున్నామని గత నెల 26వ తేది నుంచి 10వ తేది వరకు పంచాయితీల వారీగా తనిఖీల అనంతరం 12వ తేది దీనిపై బహిరంగ సభ సమావేశం నిర్వహించనున్నట్లు ఏపిఓ శివన్న తెలిపారు. సదరు ఆరోజు 10 నుంచి 2 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## స్మశానానికి దారి కల్పించండి

పావగడ, జనవరి 4 ప్రభాతవార్త



మాట్లాడుతున్న బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షులు రామాంజినప్ప

పావగడ బ్లాక్ కాంగ్రెస్ రూరల్ అధ్యక్షుడు రామాంజినప్ప పావగడ తాలూకా విరుప సముద్రం గ్రామంలో స్మశానానికి దారి కల్పించాలని బ్లాక్ కాంగ్రెస్ రూరల్ అధ్యక్షులు రామాంజినప్ప డిమాండ్ చేశారు. గురువారం తమ స్వగ్రామంలో విలేకరులతో మాట్లాడుతూ.. స్మశానానికి శవాన్ని తీసుకెళ్లాలంటే దారి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపాపరు. అన్ని కులాల వారికి ఒకే స్మశానమే ఉండేదని దానికి దారి లేక గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అధికారులు స్పందించి స్మశానానికి దారి కల్పించాలని డిమాండ్ చేశారు.

## ఘనంగా బ్రెయిలీ జన్మదిన వేడుకలు

అగళి, జనవరి 4 ప్రభాతవార్త



వేడుకలను నిర్వహిస్తున్న దృశ్యం

మండల కేంద్రమైన అగళిలో ఉన్న దివ్యాంగుల భవిత కేంద్రంలో బ్రెయిలీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓ చంద్రశేఖర్ నాయుడు ముఖ్య అతిథిగా హ్యాజరై ప్రసంగించారు. అందుల కోసం ప్రత్యేకంగా ఒక లిపిని రూపొందించిన గొప్ప వ్యక్తి బ్రెయిలీ అని కన్నులున్నవారితో సమానంగా చదవడం, రాయడం, అందులకు ఒక లిపిని సృష్టించిన మహానుభావుడని వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం హసీనా, ఉపాధ్యాయులు వంశీకృష్ణులు హాజరయ్యారు.

## నేడే ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు శాఖ మార్పు

**అగళి, జనవరి 4 ప్రభాతవార్త** : అగళి ప్రాథమిక పాఠశాల సమీపంలో ఉన్న ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు శాఖను అగళి పో లీస్‌స్టేషన్‌కి ఎదురుగా ఉన్న కొత్త భవనంలోకి 5వ తేది శుక్రవారం బ్యాంకును మార్చనున్నట్లు మేనేజర్ వినోద్‌కుమార్ తెలిపారు. ఈ శాఖ మార్పు కార్యక్రమానికి ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు చైర్మన్, ఆర్ఎం హాజరవుతారని బ్యాంకు ఖాతాదారులు ఈ సమావేశానికి హాజరు కావాలని మేనేజర్ కోరారు.

## జిల్లా టెలీకాం అడ్వైజరీ మెంబర్‌గా దొడ్డ రంగే గౌడ్

అగళి, జనవరి 4 ప్రభాతవార్త



జిల్లా టెలీకాం అడ్వైజరీ మెంబర్ దొడ్డ రంగే గౌడ్

బిజెపి జిల్లా కిసాన్‌మోర్చ ఉపాధ్యక్షులుగా ఉన్న దొడ్డ రంగే గౌడ్‌ను బిజెపి రాష్ట్ర అధిష్టానం జిల్లా టెలీకాం అడ్వైజరీ బోర్డు మెంబర్‌గా నియమించింది. నియామక ఉత్తర్వులను మడకశిర టెలీకాం జెటిఓ సంపత్‌కుమార్ చేతులు మీదుగా అందుకున్నారు. బిజెపి అభివృద్ధికి చేసిన కృషిని గుర్తించి నాకు ఈ పదవి వచ్చిందని అందుకు రాష్ట్ర బిజెపి అధ్యక్షులు పురందేశ్వరి, ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు గంగాధర్, కిసాన్‌మోర్చ జోనల్ ఇన్‌చార్జ్ చంద్రశేఖర్, జిల్లా అధ్యక్షులు శేఖర్‌ల సహకారంతో తనకు ఈ పదవి అందిందని, తనపై నమ్మకం ఉంచి పదవి కట్టబెట్టినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. సీనియర్ బిజెపి నాయకులకు సైతం కృతజ్ఞతలు తెలిపారు.

## ఆశీస్సులతో పాదయాత్ర చేపట్టిన పరిటాల శ్రీరామ్

రామగిరి, జనవరి 4 ప్రభాతవార్త



పరిటాల రవీంద్ర ఘాట్ వద్ద పరిటాల శ్రీరామ్

ధర్మవరం పట్టణంలో చేపట్టిన ప్రజా చైతన్య పాదయాత్ర కోసం పరిటాల రవీంద్ర ఘాట్ వద్ద, అదే విధంగా ఇంటి ఇలవేల్పు యల్లమ్మ దేవత వద్ద ఆశీస్సులు తీసుకుని తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి, ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ యువనేత పరిటాల శ్రీ రామ్ పాదయాత్రకు బయల్దేరారు.

## ఎంసిపల్లి పంచాయితీలో బాబుషూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ

రామగిరి, జనవరి 4 ప్రభాతవార్త



బాబుషూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

బాబుషూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఎంసి పల్లి పంచాయితీలోని తిమ్మాపురం గ్రామంలో పరిటాల సునీత ఆదేశాల మేరకు పెద్దాయన యల్.నారాయణచౌదరి నాయకత్వంలో ఇంటింటి తిరిగి బాబుషూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ పథకాలను వివరిస్తూ వచ్చేది తెలుగుదేశం ప్రభుత్వం, చంద్రబాబునాయుడుని ముఖ్య మంత్రి చేసుకుంటేనే మన రాష్ట్రం బాగుపడుతుంది. రాప్తాడులో సునీతమ్మ ఎమ్మెల్యే అవుతారు. ప్రతి ఒక్కరూ తెలుగుదేశం పార్టీని గెలిపించాలని బాబుషూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీని పెద్ద ఎత్తున తిమ్మాపురం గ్రామంలో విజయవంతం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున ఎంసిపల్లి పంచాయితీలోని మహిళలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అయోధ్య రాముని అక్షింతలు వితరణ

గుడిబండ, జనవరి 4 ప్రభాతవార్త

గుడిబండ మండల పరిధిలోని వీరజ్జనపల్లి గ్రామంలో అయోధ్య రాముని అక్షింతలు ప్రజలకు వితరణ చేశారు. ఈసందర్భంగా బిజెపి స్టేట్ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు కరేగౌడ్ ఆధ్వర్యంలో వీరజ్జనపల్లి గ్రామంలో శ్రీరామ జన్మభూమి అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను గ్రామప్రజలకు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో శివానంద, పూజారి సురేష్, నరసింహస్వామి తదితర గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## జగన్ ప్రభుత్వంలో ముస్లీం మైనార్టీలకు సముచిత స్థానం..!

- 7న జరిగే సామాజిక సాధికార బస్సు యాత్రను జయప్రదం చేయండి
- విలేఖరుల సమావేశంలో వైసీపీ ముస్లీం మైనార్టీ నాయకులు

ఉరవకొండ, జనవరి 4 ప్రభాతవార్త



విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న వైసీపీ ముస్లీం మైనార్టీ నాయకులు

రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారం లోకివచ్చి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత ముస్లీం, మైనార్టీలకు పెద్దపీటవేసి సముచిత స్థానం కల్పించారని వైసీపీ ముస్లీం, మైనార్టీ నాయకులు అన్నారు. పట్టణంలోని స్థానిక వైసీపీ కార్యాలయంలో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వైసీపీ మైనార్టీ విభాగం పట్టణ అధ్యక్షుడు పామిడి జాకీర్, వక్ఫ్ బోర్డు జిల్లా డైరెక్టర్ జి.యం.ఎస్.మీరం బాషా, జేసీఎస్ కన్వీనర్ బి.ఆసీఫ్, మండల కో ఆప్షన్ సభ్యుడు పామిడి సలీమ్, జైనబ్బీ దర్గా కమిటీ అధ్యక్షులు హోతూరు బాషా, యువజన విభాగం జిల్లా కార్యదర్శి వడ్ల సలీమ్, వార్డు సభ్యుడు పి.శర్మస్, ఎంపీటీసీ జి.వన్నూరుసాబ్ తదితరులు మాట్లాడారు. ముస్లీం మైనార్టీలకు గతంలో ఏ ప్రభుత్వం ఇవ్వని గుర్తింపును జగన్ ప్రభుత్వం ఇచ్చిందని 5 మందిని ఎమ్మెల్యేలు చేసి అందులో ఒకరికి ఉప ముఖ్యమంత్రి బాధ్యతలను అప్పగించిందన్నారు. అదేవిధంగా డిప్యూటీ ఛైర్‌పర్సన్, ఎమ్మెల్సీలుగా, మేయర్లుగా సముచిత స్థానం కల్పించి గౌరవించిందన్నారు. వాటితోపాటు ముస్లీంలలో వెనుకబడిన వర్గాల అభివృద్ధి కోసం షేక్, సయ్యద్ కారొ్పరేషన్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ముస్లీం యువతీ యువకుల వివాహాలకు 50వేల రూపాయలున్న ఆర్థిక సాయాన్ని లక్ష రూపాయలకు పెంచి సీయం జగన్ ఆదుకున్నారన్నారు. ఈక్రమంలోనే బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీలకు చేసిన మంచిని తెలియజేయడానికిగాను ఈనెల 7వ తేదీన ఉరవకొండలో మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో సామాజిక సాధికార బస్సుయాత్ర జరుగనుందన్నారు. ఈ బస్సు యాత్రకు నియోజకవర్గంలోని ముస్లీం మైనార్టీలు పెద్దఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జగన్ ప్రభుత్వానికి ముస్లీం మైనార్టీలు అండగా నిలిచి జగన్‌ను మరోమారు ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో ముస్లీం మైనార్టీ నాయకులు జిలాన్‌బాషా, రఫీక్, తాజు, అయ్యర్ దాదు, బేల్దార్ శర్మస్, టైలర్ శర్మస్, జేర్న్ జాఫర్, మహమ్మద్ అలీ, జెండా జిలాన్, ఖాధర్, యూసుఫ్, బెలగల్ షమ్ము, శిలార్ శర్మస్, ముల్లా జిలాన్, దూదేకుల శర్మస్, రఫీ, శంషుద్దీన్, ఎజియాజ్, సమీర్ పాల్గొన్నారు.

## వజ్రకరూరు పోలీస్ స్టేషన్ ఎదుట వ్యక్తి ఆత్మహత్యా యత్నం..!

- కుమార్తెకు జగనన్న విద్యా దీవెన సాయం అందకపోవడంతో మనస్థానం - పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేయడానికి వచ్చి పురుగుల మందు తాగిన వైనం

ఉరవకొండ, జనవరి 4 ప్రభాతవార్త



ఆత్మహత్యా యత్నం చేసిన బోయ వెంకటేష్

తన కుమార్తెకు ఈ ఏడాది జగనన్న విద్యా దీవెన సాయం అందలేదన్న ఆవేదనతో తీవ్ర మనస్థాపానికి గురైన వజ్రకరూరు మండలం కడమల కుంట గ్రామానికి చెందిన బోయ వెంకటేష్ అనే వ్యక్తి గురువారం సాయంత్రం వజ్రకరూరు పోలీస్ స్టేషన్ ముందు పురుగుల మందుతాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. తన కుమార్తెకు విద్యా దీవెన సాయం అందకపోవడానికి సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్ నిర్లక్ష్యమే కారణమని పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేయడానికి వచ్చిన ఆయన స్టేషన్ నుంచి బయటకు వచ్చి ఒక్కసారిగా పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకోగా అతన్ని పోలీసుల సాయంతో స్థానికులు ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. బాధితుడి కుటుంబ సభ్యుల ద్వారా తెలిసిన మేరకు వివరాల్లోకి వెళితే వ్యవసాయం ద్వారా జీవనం సాగించే వెంకటేష్‌కు ఒక కుమార్తె కళ్యాణి, ఇద్దరు కొడుకులు గోవర్ధన్, క్రిష్ణ ఉన్నారు. కుమార్తె కళ్యాణి నెల్లూరులోని సింహపురి విశ్వ విద్యాలయంలో తృతీయ సంవత్సరం సీఏ (చార్టెడ్ అకౌంటెంట్) చదువుతోంది. గడిచిన రెండు సంవత్సరాలు ఆమెకు జగనన్న విద్యా దీవెన సాయం అందింది. అయితే ఈ ఏడాది వివిధ సాంకేతిక కారణాలతో సాయం అందలేదు. దీంతో కుమార్తె చదువుకు ఫీజు ఎలా కట్టాలని తీవ్ర ఆందోళనకు గురైన వెంకటేష్ విద్యా దీవెన సాయం ఎందుకు పడలేదని యూనివర్సిటీలో విచారించగా సచివాలయంలో వివరాలు సక్రమంగా నమోదు చేయకపోవడంతో మిస్ మ్యాచ్ అయి సాయం పడలేదని చెప్పడంతో ఆయన సచివాలయం చేరుకొని అక్కడి సిబ్బంది, వాలంటీర్ (సొంత అన్న కొడుకు) ను నిలదీశాడు. దీంతో వారు ఇక్కడ తప్పు జరుగలేదని యూనివర్సిటీలోనే వివరాలు సక్రమంగా నమోదు చేయలేదని చెప్పడంతో తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. ఈక్రమంలో తప్పు ఎక్కడ జరిగిందో విచారణ చేసి తనకు న్యాయం చేయాలని కోరుతూ గురువారం మధ్యాన్నం పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన వెంకటేష్ సమస్యను అక్కడి సిబ్బందికి చెప్పి బయటకు వచ్చి తన రెండో కొడుకు క్రిష్ణ (6వ తరగతి చదువుతున్నాడు) సమక్షంలో తన వెంట తెచ్చుకున్న పురుగుల మందుతాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. దీంతో స్థానికులు పోలీసుల సాయంతో ఆటోలో అతన్ని హుటాహుటిన ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించగా ఇక్కడ చికిత్స పొందుతున్నాడు. కాగా కళ్యాణి పేరుతో సింహపురి యూనివర్సిటీలో బ్రహ్మసముద్రం మండలానికి చెందిన అదే సామాజికవర్గానికి చెందిన మరో విద్యార్థిని కూడా చదువుతుండగా యూనివర్సిటీ యాజమాన్యం ఒకరి వివరాలను మరొకరికి నమోదు చేయడంతోనే జగనన్న విద్యా దీవెన సాయం కడమలకుంటకు చెందిన కళ్యాణికి అందకుండా పోయిందని సమాచారం. ఇదిలా ఉండగా వివరాల నమోదు సమయంలో విద్యార్థిని జండర్ కాలంలో ఫిమేల్‌కు బదులు మేల్ అని సచివాలయంలో నమోదు చేశారన్న వాదన వినిపిస్తోంది. ఘటనపై పోలీసులు ఆరా తీస్తున్నారు.

## సర్పంచుల సమస్యలు పరిష్కరిస్తామనడం హర్షనీయం

- చంద్రబాబుకు కృతజ్ఞతలు

తాడిమర్రి, జనవరి 4 ప్రభాతవార్త



సర్పంచుల సంఘం అధ్యక్షులు గోనుగుంట్ల భూషణ్

తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే సర్పంచుల సమస్యలను పరిష్కరిస్తామని తెలుగుదేశం పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించడం హర్షనీయమని, ఉభయ జిల్లాల సర్పంచుల సంఘం అధ్యక్షులు గోనుగుంట్ల భూషణ్ అన్నారు. రాష్ట్రస్థాయి సర్పంచుల సమావేశం విజయవాడలో జరిగిన సదస్సులో చంద్రబాబు మద్దతు పలికి సర్పంచుల జీతాలు 10వేలు ఇస్తాననడం, అలాగే కేంద్ర ప్రభుత్వం పంపిన 8వేల కోట్ల రూపాయలను తిరిగి రాబట్టి సర్పంచుల ఖాతాకు వంద రోజుల్లోగా జమా చేస్తానని చెప్పడం, అలాగే 15వ ఆర్థిక సంఘంనిధులనుకూడా నేరుగా సర్పంచుల ఖాతాలకే జమా చేస్తాననడం, అన్ని ప్రభుత్వ కార్యక్రమాల్లో సర్పంచులకు ప్రాముఖ్యత కలిగిస్తూ వారిని సర్పంచులను రారాజులుగా పంచాయితీల్లో ఉండే విధంగా చెప్పడం హర్షనీయమన్నారు. కావున రాబోవు ఎన్నికల్లో సర్పంచులందరూ తెలుగుదేశం పార్టీని గెలిపించే దిశగా ఓటర్లలో చైతన్యం తేవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సర్పంచుల రాష్ట్ర అధ్యక్షులు రాజేంద్ర ప్రాసద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సభకు ఊహించిన దానికంటే అధిక సంఖ్యలో సర్పంచులు రావడం కొంత మంది వైకాపా సర్పంచులు రాజీనామా చేసి టిడిపిలోకి రావడం శుభ సూచకమన్నారు.

## ఫోక్సో కేసులో కీచక గురువు అరెస్ట్

గుత్తి, జనవరి 4 ప్రభాతవార్త



డిఎస్‌పి నరసింగప్ప మాట్లాడుతున్న దృశ్యం

మండలంలోని తొండపాడు గ్రామంలోని ఉన్నత పాఠశాలలో కాంట్రాక్ట్ యోగా టీచర్‌గా పనిచేస్తూ ఓ విద్యార్థినిని ప్రేమ పేరుతో మభ్యపెట్టి మోసగించిన కేసులో అనిల్‌కుమార్‌రెడ్డిని అరెస్ట్ చేసినట్లు గుంతకల్లు డిఎస్‌పి నరసింగప్ప తెలిపారు. గురువారం అర్బన్ సిఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన సంఘటన వివరాలు వెల్లడించారు. వైఎస్ఆర్ జిల్లా ప్రొద్దుటూరు మండలం చౌదూరు గ్రామానికి చెందిన అనిల్‌కుమార్‌రెడ్డి తొండపాడు జెడ్‌పిహెచ్‌ఎస్‌లో కాంట్రాక్ట్ పద్ధతిన యోగా టీచర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. అదే పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న ఓ విద్యార్థినిని ప్రేమ పేరుతో మభ్యపెట్టాడు. కల్లిబొల్లిమాటలు చెప్పి ఆమె వద్ద వున్న 2 లక్షల విలువైన 35 గ్రాముల బంగారం తీసుకున్నాడు. ఆ నగలను ఓ ప్రైవేటు ఫైనాన్స్‌లో తాకట్టుపెట్టి పల్సర్ మోటర్ బైక్‌ను కొనుగోలు చేశాడు. తదుపరి ఆ విద్యార్థినికి మాయమాటలు చెప్పి వుడాయించాడు. విద్యార్థినిపై లైంగికదాడికి పాల్పడ్డాడున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేర కు కేసు నమోదు చేసి కీచక ఉపాధ్యాయున్ని అరెస్ట్ చేసి అతని వద్ద నుండి నగలు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితునిపై ఫోక్సో చట్టంతో పాటు 406, 366, 344, 376 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపర్చగా రిమాండ్‌కు ఆదేశించారన్నారు. ఈ సమావేశంలో అర్బన్ సిఐ వెంకటరామిరెడ్డి, ఎస్ఐ నబీరసూల్, ఎఎస్ఐలు ఆజాద్, నాగమాణిక్యం, సిబ్బంది పాల్గొన్నారు.

## 24వ రోజుకు చేరిన అంగ్‌వాడీల దీక్షలు

గుత్తి, జనవరి 4 ప్రభాతవార్త



అంగన్‌డాడీలు దీక్షలు చేస్తున్న దృశ్యం

తమ న్యాయసమ్మతమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో అంగన్‌వాడీవర్కర్లు, హెల్పర్లు చేపట్టిన సమ్మె గురువారంకు 24వ రోజుకు చేరింది. ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో సిఐటియు నాయకులు నిర్మల, రామకృష్ణ, రమేష్, తదితరులు మట్లాడుతూ ప్రతిపక్షంలో ఇచ్చిన హామీలను వైఎస్ జగన్ తన ప్రభుత్వంలో నిలబెట్టుకుని అంగన్‌వాడీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని వారు విమర్శించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కళ్యాణి, పార్వతి, శోభారాణి, జయలక్ష్మి, నాగరత్న, కృష్ణకుమారి, తదితరులు పాల్గొన్నారు.

## కళ్లకు గంతలు కట్టుకుని కార్మికుల నిరసన

గుత్తి, జనవరి 4 ప్రభాతవార్త



కళ్లకు గంతలు కట్టుకుని కార్మికులు నిరసన తెలుపుతున్న దృశ్యం

రాష్ట్ర ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు గురువారం కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు నిర్మల, మల్లేష్, రమేష్, రామకృష్ణలు మాట్లాడుతూ ప్రభుత్వం కళ్లున్నా చూడలేని రీతిన వ్యవహరిస్తొందన్నారు. కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, పనికి సమాన వేతనం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్య క్రమంలో కార్మిక సంఘం నాయకులు సూర్యనారాయణ, మహేష్, రామాంజినేయులు, సుంకన్న, రాజ్‌కుమార్, మురళి, వెంకటలక్ష్మి, ఆది, తదితరులు పాల్గొన్నారు.

## జాబ్ క్యాలెండర్, జాబులెక్కడ జగన్‌రెడ్డి..!

- టీఎన్ఎస్ఎఫ్, తెలుగు యువత అర్ధనగ్న ర్యాలీ మోకాళ్ళపై నిరసన
- జగన్‌ను నమ్ముకుంటే ఆడుక్కోక తప్పదంటూ పట్టణంలో బిక్షాటన

ఉరవకొండ, జనవరి 4 ప్రభాతవార్త



పట్టణంలోని ప్రధాన కూడళిలో అర్ధనగ్నంగా మోకాళ్ళపై కూర్చొని నిరసన తెలుపుతున్న టీఎన్ఎస్ఎఫ్, తెలుగు యువత నాయకులు



చిరువ్యాపారుల వద్ద బిక్షాటన చేస్తున్న దృశ్యం

జగన్‌రెడ్డి పాలనలో నిరుద్యోగం పెరిగి యువత అడుక్కొనే పరిస్థితులు నేడు నెలకొన్నాయని ప్రతి ఏడాది జనవరి 1న జాబ్ క్యాలెండర్ విడుదలచేసి ఉద్యోగాలు భర్తీ చేస్తామని నమ్మించి నిరుద్యోగులను మోసం చేశారని టీఎన్ఎస్ఎఫ్, తెలుగు యువత నాయకులు మండిపడ్డారు. జాబ్ క్యాలెండర్, జాబు లెక్కడ జగన్‌రెడ్డి అన్న నినాదాలతో కూడిన ప్లకార్డు చేతబట్టి టీఎన్ఎస్ఎఫ్ నాయకులు నియోజకవర్గ కేంద్రమైన ఉరవకొండ పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుండి అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించి కవితా హోటల్ సర్కిల్‌లో మోకాళ్ళపై బైటాయించి నిరసన తెలిపి బిక్షాటన చేశారు. ఈ సందర్భంగా టీఎన్ఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు ప్యారం కేశవానంద, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శులు కుమారస్వామి, సుధాకర్, తెలుగు యువత నాయకులు మనిచౌదరి, వన్నూరుస్వామి, పెద్దన్న, విజయ్, నూతన్ తదితరులు మాట్లాడుతూ మాయమాటలు చెప్పి నిరుద్యోగులను నమ్మించి ఓట్లు వేయించుకొని అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి 5 సంవత్స రాలు గడుస్తున్నా వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగావున్న ఉద్యోగాలను భర్తీ చేయకుండా నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. సైకోలా వ్యవహరిస్తున్న జగన్‌రెడ్డి పాలనలో నిరుద్యోగుల జీవితాలు అంధకారంలోకి నెట్టివేయబడ్డాయన్నారు. జాబ్ కావాలంటే బాబు రావాలని జగన్ పాలనకు చరమగీతం పాడే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ నాయకులు సింగమనేని ప్రశాంత్, మనోజ్‌కుమార్, తెలుగు యువత నాయకులు విజయ్, చంద్ర, బెస్త హరి, పల్లాహరి, నూర్,భీమేష్, ధనరాజ్, ఎర్రిస్వామి, నరేష్, రమేష్, చిన్నబాబు, మోహన్, లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

## కర్ణాటక మద్యం స్వాధీనం

కంబదూర్,జనవరి 4,ప్రభాతవార్త:



మధ్య స్వాధీనం చేసుకున్న దృశ్యం

మండల కేంద్రంలోని చెక్ పోస్టు సమీపంలో 90 మిల్లీ లీటర్లు గల 150 టెట్రా ప్యాకుట్లను గురువారం ఉదయం ధీనం చేసుకోని అరెస్టు చేశామని కంబదూరు ఎస్ఐ యువరాజు మీడియాకు తెలిపారు.కర్ణాటక మద్యం తరలించే అక్రమార్కులపై పోలీస్ శాఖ తరుపున కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఎన్నికలు సమీపిస్తున్న నేపధ్యంలో చెక్ పోస్టులపై గట్టి నాఘా ఉంచామన్నారు.

## అభివృద్ధి బాటలో రాష్ట్రాన్ని నడపడమే ముఖ్యమంత్రి వైఎస్.జగన్ లక్ష్యం

ధర్మవరం, జనవరి 4 ప్రభాతవార్త



మాట్లాడుతున్న నాయకులు

రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడపడమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని మున్సిపల్ చైర్మన్ కాచర్ల లక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా 35వ వార్డు బాలాజీ నగర్‌లో పల్లెకు పోదాం అనే కార్యక్రమానిన వారు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం డిబిటి/ నాన్ డిపిటి ద్వారా సంక్షేమ పథకాలకు అందజేసిన డిస్ప్లే బోర్డు (రూ.27.20 కోట్లు) వారు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. నాలుగు సంవత్సరాలుగా ఏ ప్రభుత్వం చేయని పనులను నాడు ముఖ్యమంత్రి చేయడం పట్ల రాష్ట్ర ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని, అదే విధంగా స్థానిక ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ధర్మవరం నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడుపుతున్నారని, ఎన్నో సంక్షేమ పథకాలను అన్ని వర్గాల వారికి పంపిణీ చేయడం పట్ల వారు సంతోషాన్ని వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ వేముల జయరామిరెడ్డి, కౌన్సిలర్ చింతా మారుతిప్రసాద్, సచివాలయ కన్వీనర్ చందమూరి నారాయణరెడ్డి, మాజీ వైస్ చైర్మన్ భాగ్యలక్ష్మి, కౌన్సిలర్ చింతా పెద్ద యల్లమ్మ, కేత లోకేష్‌తోపాటు మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## వికసిత్ భారత్ కార్యక్రమం

గుడిబండ, జనవరి 4 ప్రభాతవార్త



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచు కరుణాకర్‌గౌడ్

మండల కేంద్రంలో ఎంపిడిఓ రామారావు ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచు కరుణాకర్‌గౌడ్ పాల్గొని కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడంలో అధికారులు విఫలమవుతున్నారని, అలాగే ఆర్‌డబ్ల్యూఎస్, రెవెన్యూ అధికారులు సమావేశానికి హాజరు కాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు అందజేసేందుకు అధికారులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ రామారావు, ఈఓఆర్డి నాగరాజునాయక్, ఎపిఎం ముత్యాలప్ప, ఎపిఓ భార్గవి, హెచ్‌పి గ్యాస్ నిర్వహకులు జిబి.సుధాకర్, మేనేజర్ నాగరాజు, బిజెపి అసెంబ్లీ కో కన్వీనర్ బసవరాజు, మండల అధ్యక్షులు పలారం ఉమేష్, నగర అధ్యక్షులు అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

## ఘనంగా బిజెపి జెండా ఆవిష్కరణ

కంబదూర్,జనవరి 4,ప్రభాతవార్త:



బిజెపి జండాను అవిష్కరిస్తున్న దృశ్యం



మండల కన్వీనర్‌గా గోపాల్‌ను ఎన్నుకున్నారు

భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడి చేసిన అభివృద్ధి,కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే భారతీయ జనతా పార్టీ లక్ష్యమని బిజెపి నాయకులు పేర్కొన్నారు. వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా గురువారం కంబదూరు మండల కేంద్రంలోని చెక్ పోస్టు సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన పార్టీ జెండాను భాజపా జిల్లా అధ్యక్షుడు సంధిరెడ్డి శ్రీనివాసులు,అసెబ్లీ ఇంచార్జ్ ముప్పూరి దేవరాజ్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశ అభివృద్ధి నరేంద్ర మోడీతోనే సాధ్యమన్నారు.మోడీ ప్రవేశపెట్టిన పీఎం కిసాన్ ప్రధాన మంత్రి సురక్ష బీమాయోజన,ప్రధాన మంత్రి ఉజ్వల యోజన,స్వచ్ఛ భారత్,ప్రధాన మంత్రి అవాస్ యోజన,ఇంలాంటి ఎన్నోపథకాలను పేదల జీవితాల్లో వెలుగు నింపాయని తెలియజేశారు.ఈ నెల 11 నుంచి మండల పరిధిలోని ములకనూరు గ్రామం నుంచి వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ప్రారంభమవుతుందన్నారు.అనంతరం నూతన మండల కన్వీనర్‌గా బిల్లే గోపాల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో చిత్తూరు జిల్లా ఇన్‌చార్జ్ చిరంజీవిరెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శి సోమశేఖర్,మోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు,మాజీ మండల కన్వీనర్ చక్రవర్తి,మారెన్న, కావెటి రాము,మధు,ఆది,గంగాధర తదితరులు పాల్గొన్నారు.

## హేమావతిలో శ్రీరాముని అక్షింతలు పంపిణీ

అమరాపురం,జనవరి 4,ప్రభాతవార్త:



ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్ఎస్ఎస్ ప్రముఖులు

మండల పరిధిలోని హెమావతి గ్రామంలో గురువారం అయోధ్య శ్రీరామ మందిరం నుంచి వచ్చిన పవిత్ర అక్షింతలను అలాగే కరపత్రాలను ఆర్ఎస్ఎస్ ప్రముఖులు అక్కి నారాయణ ఆధ్వర్యంలో పంపిణి జరిగింది. ఆర్ఎస్ఎస్ స్వయంపేవకులు గ్రామంలో ప్రధానవీధుల గుండా ఊరేగింపుగా వెళ్లి ప్రతి ఇంటింటికి అక్షింతలను వితరన చేయడం జరిగింది.శ్రీరాముని సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన కోరారు.

## నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బూత్ కమిటీ ఏర్పాటుకు సమావేశం

అమరాపురం,జనవరి 4,ప్రభాతవార్త:



సమావేశమైన మాజీ ఎమ్మెల్యే దృశ్యం

మడకశిర నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాబోవు ఎన్నికల్లో పోటికి సమాయత్తమవుతున్న తరుణంలో సత్యసాయి జిల్లా కాంగ్రెసన పార్టీ అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే సుధాకర్ ఆధ్వర్యంలో బూత్ కమిటీ ఏర్పాటుకు గురువారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మరియు ముఖ్య నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు.మడకశిరలోని నీలకంఠ కోల్డ్ స్టోరెజ్ నందు పార్టీ సీనియర్ నాయకులు ప్రభాకర్‌రెడ్డి,మండల కన్వీనర్‌లు మంజునాథ్,గురుమూర్తి, నాగరాజు,లోకేష్,గౌడప్ప తదితరులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సుధాకర్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని సిడబ్ల్యూసి మెంబర్ మాజీ మంత్రి రఘువీరారెడ్డి ఆశీస్సులతో కాంగ్రెసన పార్టీకి బలమైన నాయకత్వంతో పాటు కార్యకర్తల,ప్రజల మద్దతు బలంగా ఉన్నాయని పేర్కొన్నారు.గత కాంగ్రెసన ప్రభుత్వ హయాంలో నియోజకర్గంలో అన్ని గ్రామాల్లో కూడా అభివృద్ధి చేసి చూపించిన ఘనత మాజీ మంత్రి రఘువీరారెడ్డికి దక్కిందన్నారు.అయన అడుగు జాడల్లో మనమందరం కలసి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేద్దామని ఆయన కోరారు.ప్రస్తుతం భూత్ స్థాయి కమిటీలను ఏర్పాటుకు కృషి చేయాలని ఆయన తెలిపారు.

# చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

-జెసి అశ్మిత్‌రెడ్డి



వార్డులో పర్యటిస్తున్న జెసి అశ్మిత్‌రెడ్డి

**తాడిపత్రిఅర్బన్, జనవరి 4 ప్రభాతవార్త**

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ తాడిపత్రి నియోజకవర్గం ఇన్‌చార్జ్ జె.సి అశ్మిత్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన పట్టణంలోని 25,27 వార్డులతో పాటు వడ్లపాలెంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన టిడిపి నాయకులు, జనసేన నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటా తిరుగుతూ ప్రజలను ఆప్యాయంగా పలుకరిస్తూ యోగక్షేమాలు, వారి స్థితిగతులు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించాలని పార్టీ మేనిఫెస్టోలోని పథకాలను వివరిస్తూ ఆయన ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు, జె.సి అనుచరులు, అభిమానులు, జనసేన నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# శ్రీరాముని అక్షింతల ఊరేగింపు



శ్రీరాముని అక్షింతలను ఊరేగిస్తున్న దృశ్యం

**యల్లనూరు, జనవరి 4 ప్రభాతవార్త**

అయోధ్య నుండి వచ్చిన శ్రీరాముని అక్షింతలను గురువారం మండల కేంద్రం లో ఆర్యవైశ్యులు, భక్తులు ఘనంగా ఊరేగించారు. ముందుగా అక్షింతలను అమ్మవారిశాలలో వుంచి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం వాటిని మేళ తాళాల నడుమ కోటవీధిలోని రామాలయం వద్దకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఊరేగింపులో జైశ్రీరామ్ అంటూ భక్తులు ముందుకు సాగారు. ఈ కార్య క్రమంలో చైతన్య, రాఘవేంద్ర, సువన్, సుదర్శన్, కిరణ్, రమణ, కేశవ పాల్గొన్నారు.

# వైఎస్ఆర్ పెన్షన్ కానుక పంపిణీ

**పుట్లూరు, జనవరి 4 ప్రభాతవార్త**



కార్యక్రమంలో మాట్లాడుతున్న మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ సునీత

మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో గురువారం వైఎస్ఆర్ పెన్షన్ కానుక పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శింగనమల మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ భూమిరెడ్డి సునీత ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వం లబ్దిదారులకు 2750 రూపాయల నుండి 3 వేల రూపాయలకు పెంచిన మొత్తాన్ని ఆమె అందచేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా వైఎస్ఆర్ పెన్షన్ కానుక మొత్తం 3 వేల రూపాయలకు పెంచడం జరిగిందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలు అవ్వతాతలకు ఇచ్చిన మాట మేరకు ప్రతిఏటా పెన్షన్ మొత్తాన్ని పెంచుతూ వాలంటీర్ల ద్వారా ఇంటి వద్దకే అందచేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అనంతరం ఎంపిడిఓ యోగానందరెడ్డి మాట్లాడుతూ పుట్లూరు మండల వ్యాప్తంగా కొత్తగా 95 ఫించన్లు మంజూరయ్యాని వాటిని కలుపుకుని 5890 మందికి పెన్షన్ పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# భూరక్ష పాసుపుస్తకాల ప్రతులు దగ్ధం

**పుట్లూరు, జనవరి 4 ప్రభాతవార్త**



పాసుపుస్తకాల ప్రతులను దగ్ధం చేస్తున్న దృశ్యం

మండలంలోని కంది కాపుల సచివాలం వద్ద గురువారం సిపిఐ ఆధ్వర్యంలో భూ రక్ష పాసు పుస్తకాల ప్రతులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి పెద్దయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి తన ఫోటో ముద్రించి భూ రక్ష పథకం కింద పట్టాదారుపాసుపుస్తకాలు రైతులకు అందచేస్తున్నారన్నారు. రైతులకు అందచేసిన ఈ పాసుపుస్తకాలు నిరుపయోగంగా మారాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. గతంలో ఈ పాసుపుస్తకాలు భూమి అమ్మకాలు, కొనుగోలు, బ్యాంకులో రుణాలు పొందేందుకు ఉపయోగపడేవని ప్రస్తుతం భూ సమగ్ర సర్వే పేరుతో కోట్లాది రూపాయల ఖర్చుల చేసి అనంతరం రూపొందించిన పట్టాదారు పాసుపుస్తకాలు భూమి రిజిస్ట్రేషన్‌కు, తనకా పెట్టుకోవడానికి, రుణాలు పొందడానికి ఏమాత్రం ఉపయోగం లేదన్నారు. రీ సర్వే నిర్వహణ సందర్భంగా క్షేత్రస్థాయిలో పెద్దసంఖ్యలో అవకతవలు జరిగాయని రైతులకు ఉమ్మడి హక్కు పత్రాలు ఇవ్వడం వల్ల అనేక వివాదాలకు దారి తీసి రైతుల మధ్య చిచ్చు పెడుతోందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్య క్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గం అధ్యక్షులు పెద్దిరాజు, డిహెచ్ఎస్ మండల అధ్యక్షులు పెద్దన్న, చేతివృత్తిదారుల మండల అధ్యక్షులు ఓబులపతి, రైతులు వెంకటరెడ్డి, పెద్దకొండయ్య, దేవరాజ్, సూరి, రంగప్ప, వెంకటరమణ, నారాయణ, ధన, తదితరులు పాల్గొన్నారు.

# 6న స్వాతి నక్షత్రం పూజలు

**తాడిపత్రిరూరల్, జనవరి 4 ప్రభాతవార్త**



మండలంలోని ఓబులేసుకోనలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈ నెల 6వతేదీ శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. స్వామివారి జన్మనక్ష త్రం స్వాతినక్ష త్రాన్ని పురస్కరించుకుని ఉదయం స్వామివారికి అర్చకులు యోగానందశర్మ అభిషేకాలు, అర్చనలు, తిరుమంజనసేవ తదితర పూజా కార్య క్రమాలను నిర్వహించనున్నారు. హాజరైన భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందచేయనున్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ గావించనున్నారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకోవాలని అర్చకులు తెలియచేశారు.

# 29 కర్ణాటక మద్యం బాటిళ్లు స్వాధీనం

**యల్లనూరు, జనవరి 4 ప్రభాతవార్త**

మండలంలోని శింగవరం గ్రామానికి చెందిన ముప్పగొని రామాంజినేయులు అనే వ్యక్తి వద్ద నుండి 29 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ధరణిబాబు తెలిపారు. అక్రమంగా మద్యం అమ్ముతున్నాడన్న సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడులు జరిపి రామాంజినేయులును అదుపులోకి తీసుకుని అతని వద్ద నుండి 29 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో ఎవరైనా అక్రమంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

# అక్రమ కలప వాహనం పట్టివేత

- అధికారులపై బెదిరింపులకు దిగిన యజమాని



అక్రమ కలప వాహనం వెంటపడిన అటవీ అధికారులు

**యాడికి(తాడిపత్రి),జనవరి4,ప్రభాతవార్త**

యాడికిలోని ఓ టింబరు డిపోకు అక్రమంగా కలపను తరలిస్తున్న వాహనాన్ని అటవీశాఖ అధికారులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. గుత్తి ఫారెస్టు సెక్షనాఫీసరు నారపరెడ్డి తన సిబ్బందితో తనిఖీలు నిర్వహిస్తుండగా అక్రమంగా కలపను తరలిస్తున్న ఏపీ02ఎక్స్8744 ట్రాక్టరు వారి కంటపడింది. సదరు ట్రాక్టరును గుత్తికి తరలిస్తుండగా ఆ ట్రాక్టరు యజమాని అధికారులపై బెదిరింపులకు పాల్పడటం, రాయలచెరువులో రవాణాశాఖ అధికారులు ఉన్నారు.. వాహనాన్ని ముందుకు కదిలిస్తే జరిమానా విధిస్తారని సదరు వాహన చోదకుడు మొరాయించడంతో అటవీ శాఖ అధికారి నారపరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. వాహనాన్ని గుత్తికి తరలించకపోతే దాడికేసు పెడతానని ఆయన హెచ్చరించడంతో కలప వాహనం గుత్తికి తీసుకొనిపోయారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సదరు వాహనంపై తగిన చర్యలు తీసుకుంటామని అటవీ అధికారులు తెలిపారు.

# బాబు - షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం



కరపత్రాలను పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

**పుట్లూరు, జనవరి 4 ప్రభాతవార్త**

మండలంలోని కడవకల్లు పంచాయతీలో గురువారం బాబు - షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి సుదర్శన్‌నాయుడు మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్ర భవిష్యత్తు బాగుంటుందన్నారు. వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి తెలుగుదేశం పార్టీని గెలిపించాలన్నారు. అనంతరం టిడిపి మెనీ మేనిఫెస్టో కరపత్రాలను ప్రజలకు అందచేస్తూ సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ శివశంకర్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, గోవర్ధన్‌రాజు, సోము, పెద్దయ్య, ఆదినారాయణరెడ్డి, రామాంజినేయులు, భాస్కర్‌నాయుడు, గంగయ్య, నరసింహ, జీవన్, తదితరులు పాల్గొన్నారు.

# 24వ రోజుకు చేరిన అంగన్‌వాడీల సమ్మె



అంగన్‌వాడివర్కర్లు నిరసన తెలుపుతున్న దృశ్యం

**పుట్లూరు, జనవరి 4 ప్రభాతవార్త**

అంగన్‌వాడి వర్కర్స్, హెల్పర్లు తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ చేపడుతున్న సమ్మె గురువారం 24వ రోజుకు చేరింది. నిరసనలో భాగంగా అంగన్‌వాడీవర్కర్లు, హెల్పర్ల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అనేక రకమైన కార్యక్రమాల్లో నిరసన తెలుపుతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సూరి డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ టీచర్ యూనియన్ లీడర్ జయలలిత, శశికళ, అనంతలక్ష్మి, రమాదేవి, మండల కార్యదర్శి వెంకటచౌదరి, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు పెద్దయ్య, మండల కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, కెవిబిఎస్‌కె నాగభూషణ్, అంగన్‌వాడీటీచర్లు, హెల్పర్లు, తదితరులు పాల్గొన్నారు.

# నూతన పెన్షన్లు పంపిణీ చేసిన సాయిప్రతాప్‌రెడ్డి



పెన్షన్ అందచేస్తున్న కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి

**తాడిపత్రిఅర్బన్, జనవరి 4 ప్రభాతవార్త**

పట్టణంలోని కృష్ణాపురం 1వరోడ్డు గ్రామ సచివాలయం పరిధిలో ప్రభుత్వం మంజూరు చేసిన నూతన పెన్షన్లను గురువారం యువనాయకులు కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులందరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. వీటిని లబ్దిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# చెత్త తరలిస్తున్న వాహనాలను అడ్డుకున్న కార్మికులు



చెత్త తరలిస్తున్న వాహనాన్ని అడ్డుకుంటున్న కార్మికులు

**తాడిపత్రిఅర్బన్, జనవరి 4 ప్రభాతవార్త**

తాడిపత్రి పట్టణంలో చెత్త తరలిస్తున్న వాహనాలను మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులు గురువారం అడ్డుకున్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని గత కొన్ని రోజులుగా మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు నిరసన తెలుపుతున్నారు. పట్టణంలో చెత్త పేరుకుపోవడంతో ప్రైవేటు వాహనాలను ఏర్పాటు చేసి చెత్త తరలిస్తుండగా మున్సిపల్ కార్మికులు అడ్డుకున్నారు. తమ డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించేవరకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని వారు పేర్కొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో యువకునికి గాయాలు

**ముదిగుబ్బ, జనవరి 4 ప్రభాతవార్త**

మండలంలోని వలించెర్లోపల్లి గ్రామానికి చెందిన గంగాద్రి పనినిమిత్తం ముదిగుబ్బ నుండి తిరుగు ప్రయాణంలో బైకుపై స్వగ్రామానికి వెళుతుండగా స్థానిక కస్తూరిబా స్కూల్ ప్రాంతంలో అనంతపురం వైపు నుండి వస్తున్న బొలెరో వాహనానికి ఢీ కొనడంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక పోలీసులు వెంటనే స్పందించి బాధితున్ని 108 వాహనంలో బత్తలపల్లికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ షౌకత్‌అలి తెలిపారు.



గాయపడిన గంగాద్రి

# తాగునీటి పైపులైన్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే

**తాడిపత్రిరూరల్, జనవరి 4 ప్రభాతవార్త**



తాగునీటి కొళాయి పైపులైన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి

మండలంలోని గదరగుట్ట పల్లి గ్రామంలో తాగునీటి కొళాయిపైపులైన్‌ను గురు వారం ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ప్రారంభించారు. అల్ట్రాటెక్ సిమెంట్ యాజమాన్యం సిఎస్ఆర్ నిధులతో ఈ తాగునీటి కుళాయిపైపులైన్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అల్ట్రాటెక్ యాజమాన్యం, సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామాల్లో మాజీ ఎంపి సుడిగాలి పర్యటన



గ్రామంలో పర్యటిస్తున్న మాజీ ఎంపి జెసి దివాకర్‌రెడ్డి

**తాడిపత్రిరూరల్, జనవరి 4 ప్రభాతవార్త**

మండలంలోని ఊరుచింతల, తలారిచెరువు గ్రామాల్లో గురువారం మాజీ ఎంపి జె.సి దివాకర్‌రెడ్డి సుడిగాలి పర్యటన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన ఆయా గ్రామాల్లోని టిడిపి నాయకులు, కార్యకర్తలు, జె.సి అభిమానుల ఇళ్లకు వెళ్లి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుపుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆయన వారికి సూచించారు. ఆయన వెంట మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు వున్నారు.

# పెన్షన్లు పంపిణీ చేసిన ఫయాజ్‌బాష

**తాడిపత్రిఅర్బన్, జనవరి 4 ప్రభాతవార్త**



పెన్షన్‌ను అందచేస్తున్న ఫయాజ్‌బాష

పట్టణంలోని 2వవార్డులో గురువారం వైసిపి నాయకులు, ఫయాజ్‌బాష ట్రస్ట్ చైర్మన్ హీరాపురం ఫయాజ్‌బాష పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన రెడ్డి ఇచ్చిన మాటమేరకు పెన్షన్లు 2750 రూపాయల నుండి 3 వేల రూపాయలకు పెంచడం జరిగిందన్నారు. అదేవిధంగా వార్డులో నూతనంగా మంజూరైన పెన్షన్లను ఆయన పంపిణీ చేశారు.

# బొందలదిన్నెలో పర్యటించిన సాయిప్రతాప్‌రెడ్డి

**తాడిపత్రిరూరల్, జనవరి 4 ప్రభాతవార్త**



పథకాలను వివరిస్తున్న సాయిప్రతాప్‌రెడ్డి

మండలంలోని బొందల దిన్నె గ్రామంలో యువ నాయకులు కేతిరెడ్డి సాయి ప్రతాప్‌రెడ్డి గురువారం పర్యటించారు. ఈ సంద ర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం ప్రజల యోగక్షేమాలు, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫించన్లు సక్రమంగా అందుతున్నాయా అని వృద్ధులను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని వివరించారు. రానున్న ఎన్నికల్లో మరోమారు వైసిపిని గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# వివాహానికి బీజేపి నాయకుడు ఆర్థిక సహాయం

**నంబులపూలకుంట, జనవరి 4, ప్రభాతవార్త:**





ఆర్థిక సహాయం అందజేస్తున్న షేక్‌బాబ్‌జాన్

మండల కేంద్రంలోని పెడబల్లి రోడ్డులోని బీజేపి కార్యాలయంలో బీజేపి రాష్ట్ర మైనార్టీ మోర్చా మెంబర్ షేక్‌బాబ్‌జాన్ కదిరి పట్టణానికి చెందిన ముస్లిం యువతి వివాహానికి రూ. 10వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది. కదిరి పట్టణంలోని నిజాంవలీ కాలనీ 15 వార్డుకు చెందిన పి.జాబీర్‌ఖాన్, పి జరీనాల కుమార్తె వివాహానికి ఆర్థిక సహాయం అందజేయడం తల్లిదండ్రులు ధన్యవాదాలు తెలియజేశారు.

# వికసిత్ భారత్ సంకల్ప యాత్రపై అవగాహన సదస్సు



వికాసిత్, భారత్ గుర్తింపు కార్డులను పంపిస్తున్న గ్రామ సర్పంచ్

**నల్లచెరువు, జనవరి 4, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని ఎర్రగుంట్లపల్లి గ్రామ పంచాయతీలో ఓరువాయిలోని గ్రామ సచివాలయం నందు ఎంపిడిఓ శంకుతల ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా న్యూడల్ ఆఫీసర్ శంకుతల మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సేవలను ఈ నెల 4వ తేది నుండి 10వ తేది వరకు ప్రతి రోజు రెండు గ్రామ పంచాయతీలలో అన్ని శాఖల అధికారులు పాల్గొని కేంద్ర ప్రభుత ్వం ప్రవేశపెట్టిన వికసిత్ కార్యక్రమంను గ్రామ ప్రజలకు అవగాహన కార్యక్రమం జరుగుతుందని, కేంద్ర ప్రభుత్వం ఫలాలు 132 రకాల సేవలపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, గ్రామ ప్రజలు ఏవైనా సమస్యలు ప్రభుత్వ ఫలాలు అందని వారు ఈ కార్యక్రమంలో విన్నవించుకోవాలని ఎంపిడిఓ తెలిపారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పిటి ఆంజినేయులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సేవలను సామాన్య ప్రజలకు అలాదేవిలు, చేతి వృత్తుల పనుల్లో ఎదగలేక కుటుంబంలో ఇబ్బందులు గురి అవుతున్నారని, ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన విశ్వకర్మ పథకాలు ఒక సభ్యునికి రూ.లక్ష రూపాయలు వడ్డీలేని రుణం కల్పించి ఉన్నారని, బ్యాంక్‌లో లావాదేవీలు, డిజిటల్ టెక్నాలజీ రైతులకు పియం కిసాన్ భీమా ఉచిత గ్యాస్ కనెక్షన్‌లు రైతులకు కిషన్ సమృద్ధి యోజన క్రింద 6000 రైతుల ఖాతాలో జమ అవుతుందని, గ్రామాలలో ఎన్ఆర్‌జిఎస్ ఉపాధి పనులు కల్పించడం, రైతులకు యూరియా సబ్సీడి సదుపాయం, ఉచిత ఆరోగ్య సేవలను అందిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి నరేంద్ర మోదీకి గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలపాలని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో తలమర్లవాండ్లపల్లి గ్రామ సర్పంచ్ హర్షవర్ధన్‌నాయుడు, ఓరువాయి గ్రామ పంచాయతీ సర్పంచ్ గంగాదేవి, వైద్య అధికారులు అలేఖ్య, బ్యాంక్ మేనేజర్ ప్రభావతి, మాజీ మండల అధ్యక్షులు ఇంతియాజ్ అహ్మద్, ఇబ్రహిం, వేమనారాయణ జెరిపిటి శంకర, పలువురు పాల్గొన్నారు.

# డాక్టర్ రమణనాయక్‌ను సన్మానించిన వైద్యులు

**శింగనమల, జనవరి 4 ప్రభాతవార్త**

ఉమ్మడి జిల్లా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైద్యుల అసోషియేషన్ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ మెంబర్‌గా ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నికైన డాక్టర్ రమణనాయక్‌ను గురువారం డిసిహెచ్ఎస్ డాక్టర్ పాల్ రవికుమార్ శాలువాతో సత్కరించి పూల బొకేను అందించి ఘనంగా సన్మానించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ వైద్యుల సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తూ భవిష్యత్తులో మరింత ఉన్నత స్థితి ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇతర వైద్యులు పాల్గొన్నారు.



డాక్టర్ రమణనాయక్‌ను సన్మానిస్తున్న దృశ్యం

# బిజెపి మండలాధ్యక్షునికి సన్మానం



ఇందుకూరి సురేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

**అమడగూరు, జనవరి 4 ప్రభాతవార్త**

అమడగూరు మండల బిజెపి అధ్యక్షునిగా ఎంపికైన ఇందుకూరి సురేందర్‌రెడ్డిని గురువారం స్థానిక శ్రీచౌడేశ్వరి కళ్యాణమండపంలో గురువారం ఆ పార్టీ జిల్లా నాయకులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మండలంలో భారతీయ జనతాపార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. అధిష్టానం ఎవరిని ఎమ్మెల్యేగా నిర్ణయించినా వారి గెలుపుకు కృషి చేయాలన్నారు. ప్రధాని నరేంద్రమోడి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అడ్డుపెట్టుకుని రాష్ట్రాలు అమలు చేస్తున్నట్లు గొప్పలు చెప్పుకుంటున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రతి బిజెపి నాయకుడు, కార్యకర్త ఇంటింటికి వెళ్లి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించి ఎన్నికల్లో బిజెపికి అధిక ఓటింగ్ శాతం సాధించాలని పేర్కొన్నారు. ఈ కార్య క్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షులు కొండం రాజు, లాయర్ హరికృష్ణ, సీనియర్ నాయకులు సుబ్బిరెడ్డి, రాము, గంగులప్ప, వెంకటనారాయణ, మూర్తి, తదితర బిజెపి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ఖాసీంఖాన్.. ఇక కదిరిలో నీ ఆటలు సాగవ్..

- ఎన్నికలు రాగానే ప్రత్యక్షం..- ముగియగానే పరార్- సొంత పార్టీ కార్యకర్తలను విస్మరించిన ఘనత ఆయనదే..
- లయన్ ఖాసీం ఖాన్‌కు ఎట్టి పరిస్థితుల్లో సహకరించే పరిస్థితి లేదు

**కదిరి, జనవరి 4 ప్రభాతవార్త**



ఖాసిం ఖాన్

నమ్ముకున్న కార్యకర్తలను నట్టేట ముంచడం ఆయన నైజం. లాభం ఉందనుకుంటే ఎంతవరకైనా వస్తాడు. కష్టం వస్తే మాత్రం కన్నెత్తి చూడడు. సాధారణంగా ఎన్నికల సమయంలో హడావుడి చేసే నాయకులను చూస్తుంటాం. కొందరైతే సీజన్‌ఫ్రూట్‌లాగా పార్టీలు మారుతూ పబ్బం గడుపుతున్నారు. బడా నాయకులు అని గొప్పలు చెప్పుకునే ఒక నాయకుడు మాత్రం స్వార్థ రాజకీయాలు చేస్తూ వర్గ పోరుకు ఆజ్యం పోస్తూ నమ్మిన కార్యకర్తలను నిండా ముంచేస్తూ పబ్బం గడుపుతున్నారు. ఆయన ఎవరో కాదు లయన్ ఖాసీం ఖాన్.. ఇక నీ స్వార్థ రాజకీయాలు కదిరిలో సాగవ్.. అంటూ కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు దుమ్మెత్తి పోస్తున్నారు. ఎన్నికలు రాగానే హడావుడి చేస్తూ ఎన్నికల బరిలో ఉంటారని, అవకాశం కల్పించాలని మతపరమైన, కులపరమైన రాజకీయాలు చేస్తూ ప్రశాంత వాతావరణంలో అలజడి సృష్టించే విధంగా ఆయన వ్యవహరిస్తున్న తీరుపట్ల సొంత పార్టీ కార్యకర్తలతోపాటు ప్రజా సంఘాల నాయకులు దుమ్మెత్తి పోస్తున్నారు. ఎన్నికలు రాగానే ప్రెస్ మీట్లు నిర్వహించి బరిలో ఉంటానని ప్రకటిస్తారు. ఎన్నికలు ముగియగానే పరారవుతున్నట్లు ఆ పార్టీ ద్వితీయ శ్రేణి నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2009 ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ హిందూపురం పార్లమెంట్ అభ్యర్థిగా లయన్ ఖాసీం ఖాన్ బరిలో నిలవగా తెలుగుదేశం అభ్యర్థి నిమ్మల కిష్టప్ప చేతిలో ఘోరంగా ఓటమి పాలు అయ్యారు. అప్పట్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఎన్నికల సమయంలో ఖర్చు చేసిన మొత్తాలను పదింతలు సంపాదించుకుని సొంత పార్టీ కార్యకర్తలకు 10 రూపాయలు అందజేసిన దాఖలాలు లేవని ఆ పార్టీ శ్రేణులు విమర్శలు గుప్పిస్తున్నారు. ఆ ఎన్నికల తర్వాత అడపాదడపా రాజకీయాలు చేస్తూ మరోసారి 2014లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరపున ఎన్నికల బరిలో నిలిచేందుకు ప్రయత్నాలు చేయగా బెడిసి కొట్టాయి. అనంతరం సొంత వ్యాపారాలు చేసుకుంటే నమ్ముకున్న కార్యకర్తలను ఏ మాత్రం పట్టించుకోకపోగా రాష్ట్రంలో మారిన రాజకీయ పరిస్థితుల దృష్ట్యా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోదరి వైఎస్.షర్మిల కాంగ్రెస్ పార్టీలోకి రావడంతో ఎలాగైనా కదిరి టికెట్ సాధించాలన్న ఉద్దేశ్యంతో ఢిల్లీలో షర్మిల రాహుల్ గాంధీ, మల్లిఖార్జున ఖార్గే సమయంలో కాంగ్రెస్ పార్టీలోకి చేరగానే హడావుడి చేసి కదిరి ఆర్ అండ్ బి అతిథి గృహంలో ప్రెస్‌మీట్‌నిర్వహించి ఎన్నికల బరిలో కాంగ్రెస్ పార్టీ తరపున బరిలో ఉంటానని బడాయి కూతలు కూయడంతో ఒక్కసారిగా కాంగ్రెస్ పార్టీ నాయకులు రెచ్చిపోయారు. ఇదేమి సంస్కృతి అని తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నారు. పార్టీ కష్ట కాలంలో ఉన్నప్పుడు కన్నెత్తి చూడని ఖాసీం ఖాన్, మారిన పరిస్థితుల దృష్ట్యా రాజకీయాలు చేయడం, టికెట్టు ఆశించడం సమంజసం కాదన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీకి కష్టపడిన వ్యక్తికే టికెట్ వస్తుందని లయన్ ఖాసీం ఖాన్‌కు ఎట్టి పరిస్థితుల్లో టికెట్ వచ్చే అవకాశం లేదని ఆ పార్టీ శ్రేణులు తెలుపుతున్నారు.

**సొంత పార్టీ కార్యకర్తలను పట్టించుకుంటే ఒట్టు :**

కష్ట కాలంలో పార్టీ ఉన్నప్పుడు ఆ పార్టీ నాయకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అధికార పక్షంపై ఎప్పటికప్పుడు ఉద్యమాలు చేస్తూ కాంగ్రెస్ పార్టీ జెండా కనపడే విధంగా చేస్తున్నారు. ఇటీవల నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ సీడబ్ల్యూఎస్ మెంబర్ రఘువీరారెడ్డి, రాష్ట్ర పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజుల అధ్యక్షతన కుల గణనపై కదిరిలో పెద్ద ఎత్తున కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా పార్టీల నాయకులు పాల్గొన్నారు. లయన్ ఖాసీం ఖాన్ మాత్రం పత్తా లేదు. ఇప్పుడేమో మారిన పరిస్థితుల దృష్ట్యా కాంగ్రెస్ పార్టీ తరపున బరిలో ఉంటానని అనడం ఎంత వరకు సమంజసమో ఆయనే తెలపాల్సిన అవసరం ఉందని ఆ పార్టీ నాయకులు తెలపాల్సిన అవసరం ఉ ందన్నారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాల పట్ల ఎప్పటికప్పుడు ప్రశ్నిస్తూ ధర్నా కార్యక్రమాలు చేపడుతున్నామని, తీరా ఎన్నికల సమయం రావడంతో ప్రెస్ మీట్‌లు నిర్వహించి బరిలో ఉంటానని అనడం సబబు కాదన్నారు. ఇదే విషయాన్ని అధిష్టానం దృష్టికి తీసుకెళ్తామని కాంగ్రెస్ పార్టీ నాయకులు ముక్తకంఠంతో తెలిపారు. ఏది ఏమైనప్పటికీ లయన్ ఖాసీం ఖాన్ స్వార్థ రాజకీయాలు కదిరిలో ఇక చెల్లవన్న విషయాన్ని గుర్తించుకుంటే మంచిదని పలువురు హితవు పలికారు.

